# సౌతంత్రం

సాంబయ్య చనిపోయినప్పుడు ఏదో విధంగా అందరూ సంతోషించిన వాళ్ళే. ఒక్క సాంబయ్య భార్యమాత్రం పసుపూ కుంకుమ పోయినందుకు ఏడ్చింది. అంతే. సాంబయ్యకు పిల్లా జెల్లా లేరు. కాబట్టే, మిగిలిన ఆ సాయమ్మ పోతే లప్ప లప్ప తమకే వచ్చిపడుతుందని దాయాదులు మురిసిపోయ్యారు. 'గండ కతెర మనిషి చచ్చినాడు. ఇంక ఆడ మనిషి ఆ సాయమ్మ అప్పులు వసూలు చేసుకొంటుందా, చస్తుందా?' అని ఒల్లలేక సాంబయ్య దగ్గర అప్పు సప్పు చేసిన వాళ్ళంతా సంతోష పడ్డారు. సాంబయ్య బతికుండగా సాయమ్మ మంచితనం చూసిన బీదా బిక్కా తమ అప్పుల్ని రద్దు చేస్తుందని ఆశపడ్డారు.

అమధ్య ఎప్పుడో చేలోపడ్డ గానుక మల్లమ్మ ఎద్దును సాంబయ్య ఒక్క తన్నుతంతే అది చచ్చింది. గానుగ మల్లమ్మ సాంబయ్య నేమీ చెయ్యలేక, రెండు రోజులు తిండి తిప్పలు మాని నెత్తీ నోరూ మొత్తుకొంది. లోలోపల శాప వార్థాలు పెట్టి పెట్టి ఊరుకొంది. ఇప్పుడు సాంబయ్య పోయాక చూడను చూసు

కాని మళ్ళీ ఏడ్చింది. 'పేదోళ్ల ఉసురు ఊరికే పోతాదా ?' అని మెటికలు విరిచి ఊరడిల్లింది. 'పాపిష్టోడు ! మంచాన బడకుండా మంచి సావు సచ్చినాడే' అని దిగులుపడిపోయింది.

సాంబయ్య చావులో తనకేదో ముక్తి లభించిందని అనుకొన్నవాడు రాముడు. వాడికి సాంబయ్య మీద గొంతుదాకా కసి ఉంది. రాముడికి సాంబయ్య వరుసకు వేలు విడిచిన మేనమామే. అయినా తన తల్లి దిక్కులేని చావు చావడానికీ, తనిట్లా పిల్లసేద్యగాడుగా మారడానికీ సాంబయ్యే కారకుడని రాముడికి ఎప్పుడో అర్థమైపోయింది.

మూడేళ్ళ కిందట తాగి తాగి, పేకాట ఆడి ఆడి, ఆస్తంతా తెగనమ్మి భర్త చనిపోతే యే దిక్కూలేని రాముడి తల్లి సాంబయ్య పంచన చేరింది – అన్న కదా అని. సాంబయ్య భవబంధాల సారం తెలిసిన వాడు. కాబట్టే చెల్లెల్నీ, పదేళ్ళు పెబడి ఏపుగా ఉన్న మేనల్లుడినీ చూసి రేట్లు పెరిగిన ఈ రోజుల్లో ఇంత తిండి పడేస్తే తేరగా పనిచేసే ఇద్దరు మనుషులొచ్చారను కొన్నాడు. అందుకే ఇంట్లోకి రానిచ్చాడు.

వెనక తినడానికి ఎవరూ లేని అన్న, తన కొడుకునేదో ఉద్ధరిస్తాడను కొంది, రాముడి తల్లి. రెండేళ్ళు గొడ్డుచాకిరి చేసి సాంబయ్య గట్లూ, చేలూ, గింజా గిట్టా కాకిలాగా కాపాడింది. క్షయ వచ్చి మందూ మాకూ లేక యేడాది కింద చచ్చిపోయింది. యేడాది నుంచి రాముడు పిల్లసేద్యగాడుగా మారిపోయాడు.

రాముడికి సాంబయ్య అంటే అందుకే కసి. వాడి దృష్టిలో సాంబయ్య అంటే మేనమామ కాదు. గాటిపాటకూ, కలంలోకీ, చేలోకీ, రోటి దగ్గరకూ, విసుర్రాయి దగ్గరకూ, కడుగు నీళ్ల తోడడానికీ, నీళ్ల తేవడానికి తరిమి తరిమి ఒక్కక్షణం తీరిక ఇవ్వకుండా చెండుకొని పనిచేయించే దయ్యం. అందుకే సాంబయ్య చావులో తన విముక్తిని వాడు చూశాడు.

అయితే సాంబయ్య చనిపోయినరోజు సాయమ్మ దుఃఖం చూసి వాడు బాధ పడకుండా ఉండలేక పోయాడు అత్త అంటే వాడికి ఏ మూలో కాస్త అభిమానం ఉంది. బంధుత్వాన్ని చూసి కాక, ఆమెలో కన్పించిన కొంచెం మానవత్వంపట్ల కొంత చలనం ఉంది. ఇన్నాళ్లూ ఇంట్లో మనిషిలాగా పెట్టుపోతలు జరపక పోయినా, కనీసం కడుపునిండా తిండైనా పెట్టింది. దాంతో సాంబయ్య పోయి నందుకు కాక ఆమె కొచ్చిన కష్టానికి వాడు ఏడ్చాడు.

"ఇంక నాకు దిక్కెవరురా నాయనా నువ్వు తప్ప ? అంతా పీక్కుతినే వాళ్ళే," అని సాయమ్మ రామున్ని పట్టుకొని ఏడ్చినప్పుడు, వాడికి వాళ్ళమ్మ

జ్ఞాపకంవచ్చి ఏడ్చేశాడు. ఏడుస్తూ తనను సాయమ్మ ఇకముందు అమ్మలాగా చూసుకొంటుందని అనుకొన్నాడు.

దివసాలూ అవీ అయ్యేవరకు సాంబయ్య లేని ఇంట్లో రాముడు స్వేచ్ఛగా గుండెలనిండా గాలి పీల్చుకొన్నాడు. సాయమ్మ కూడా నెలరోజులపాటు బాగా చూసుకొంది. పెద్దయ్యేంతవరకు ఉంచుకొని, పెళ్ళి పెటాకులు చేసి, అంతో ఇంతో ఆస్తి కూడా ఇవ్వాలనుకొంది – ఆ దివసాల రోజుల్లో.

భర్త చావు పాతబడి ఇంటి పెత్తనమంతా తన చేతి మీదుగా జరుగుతుందనే జ్ఞానం సాయమ్మకు వచ్చిందో లేదో, ఆమెలో మార్పు రాసాగింది. సాంబయ్యలా వేపుక తినడం లేదుగాని, కొంత నాగరికంగానే ప్రవర్తించింది. అయితే చాలా విషయాల్లో, సాయమ్మలో రామునికి చిన్నసైజు సాంబయ్య కనిపించసాగాడు. దాంతో ఈ మధ్యకాలంలో ఉత్సాహంగా పనిచేస్తున్నవాడు కాస్తా బిగుసుకుపోయాడు. చేసే పనిలో తృప్తిపోయింది. శ్రద్ధ సన్నగిల్లింది. శిక్షాకాలం ఎప్పుడు పూర్తవుతుందా అని ఎదురుచూసే ఖైదీలాగా వాడిప్పుడు తయారయ్యాడు. జైలు సూపరెంటెండెంటు మీద, జైలుమీద ఖైదీలకులాగే వాడికీ, సాయమ్మ మీద, సాయమ్మ ఇంటిమీద ద్వేషం పెరగసాగింది.

ఆ రోజు సాయంత్రం సాయమ్మ, రామున్ని పొట్టేలు పిల్లని మేపడానికి తీసుకపొమ్మంది. రాముడు దాన్ని పట్టుకపోయాడు. అది చేలగట్లమీద మేస్తూ ఉంది. ఆ దగ్గరలోని చింతచెట్టుకింద ఆడుకొంటున్న పిల్లలు రామున్ని పిలిచారు. వాళ్ళతోపాటు, రాముడు ఆటల్లో మునిగిపోయాడు. ఇళ్ళకు వెళదామని చూస్తే, పొట్టేలుపిల్ల ఎక్కడా కనిపించలేదు. రాముడికి భయమెత్తుకుంది. ఇంటికివెళ్తే, సాయమ్మ ఏం చేస్తుందో అని హడలిపోయాడు.

"పొట్లిపిల్ల ఇంటికి నేరుగా పోయుంటుందిలే," అన్నాడు ఒక సావాసకాడు.

"కొత్తది. దారి తెల్దు" అంటూ కళ్ళాలు, దొడ్లు వెతికాడు. పొట్టేలుపిల్ల జాడే లేదు. చీకటిపడే వేళకు రాముడు భయం భయంగా ఇల్లు చేరాడు.

"పొట్టిపిల్ల యాడరా?" అని అడిగింది సాయమ్మ, అనుమానంగా.

"ఇంటికి రాలే?" అడిగాడు రాముడు, ధైర్యం కూడగట్టుకొంటూ.

ఆ ప్రశ్నలోనే సాయమ్మకు సమాధానం దొరికింది. పొట్టేలుపిల్ల తప్పిపోయిందని రూఢి చేసుకొంది. ఆ మొన్ననే బాకీ కక్కమని పంచాయతి పెడితే, గొల్ల చిన్నబ్బ వడ్డీలోకి ఇంట్లో కట్టేసిపోయిన పొట్టేలుపిల్ల అది. ఇంకా నెల రోజులు పోతే, ఇన్నూరు మున్నూరు అయ్యే జీవం. వడ్డీలూ, రాబోయే లెక్కలూ జ్ఞాపకం వచ్చేవేళకు, సాయమ్మకు మొగుని పూనకం వచ్చింది. తిట్లకు లంకించుకొంది:

"నువ్వెక్కడ సచ్చినావు? ఏడ తిరుగుతున్నావు? పద్నాలు గేండ్లు మీది కొచ్చినయ్! ఇంకా పిల్లాటలు పోలా! కొంప గూలుసున్నావు. మిమ్మలందర్ని సాకి సాకి నా కొంప గుల్ల అయితాంది. రేపు అంబళ్ళపొద్దు లోపల పొటిని ఇంటి కాడ కట్టేసి పడెయ్యకపోయినావా నీ సంగతి తెలుస్తుంది. ఆ పొట్టిపిల్ల నీ మాదిరి దొంగ మొగంది. జీవాల్లో కల్సిందేమో..."

కాంతాళం పట్టలేక దగ్గరోని రోటిమీద మూసిన పాతచేట తీసుకొని రాముణ్ణి గబగబా నాలుగు దెబ్బలేసింది.

రాముడి రక్తం ఉడుకెక్కింది. అయినా కిక్కురు మనలేదు. సాయమ్మ ఇంకా వదరుతూనే ఉంది.

ఇంతలో సాంబయ్య దాయాది కొడుకు పరుగెత్తుకుంటూ వచ్చి సాయమ్మకు శుభవార్త అందించాడు:

"సిన్నమ్మా! మన పొట్టిపిల్ల వాళ్ళ జీవాల్లో సేరిందంట. గొల్ల సిన్నబ్బి కొడుకు కనబడి సెప్పినాడు. ఇప్పుడు వాన పడతాందిలే. రేపొద్దున్న రాముణ్ణి పంపు" అంటూ.

"అంతా మీ పెదనాయిన మాదిరే జాగ్రత్త మనిషివిరా" అంటూ సాయమ్మ వాణ్ణి ఉబ్బించి పంపేసింది. ఆ తర్వాత రాముడి కింత పళ్ళెంలో పడేసింది.

"ఇంక తిండి గతుకుదువు రా! రెండు సంగటి ముద్దలకు తక్కువ తినవు. పనికి మాత్రం పనికిరావు. వాణ్ణి సూసైన్నా బుద్ధి తెచ్చుకో," అంది శాపనార్థాలు పెడుతూ.

పెట్టిన అన్నం వాడికి సహించలేదు. కాయకష్టంలో ఆకలి తప్పదు. అదేదో అరకడుపుకు తీర్చుకొని, లేచి బండ్ల మిద్దెలో పడుకొన్నాడు.

వర్షం కురుస్తూనే ఉంది. రాముడికి నిద్రపట్టలేదు. ఆ వర్షం రాత్రిలో వాడికి అమ్మా, మూడేళ్ళ క్రిందట తామున్న ఊరూ, చెట్లూ, చేమలూ, తోటలూ, దొడ్లూ, తను వెళుతూ ఉండిన స్కూలూ, తనకు చదువు బాగా అబ్బుతుందన్న అయ్యవారూ, స్నేహితులూ, ఆటలూ, పాటలూ, ఆ తర్వాత సాంబయ్య ఇంట్లోని బతుకూ అన్నీ జ్ఞాపకానికి రావడం మొదలుపెట్టాయి. పొద్దు పోయిందాకా కుళ్ళు కొని ఏడ్చి, యే నడిజామునో నిద్రపోయాడు. వర్షం ఎప్పుడు నిలిచిపోయిందో వాడికి జ్ఞాపకమే లేదు.

మలికోడి కూసిందో లేదో సాయమ్మ రాముణ్ణి నిద్రలేపి కసిరింది: "పేడకళ్ళు గంపకెత్తి, పల్లెకుపోయి పొట్టిపిల్లను పట్టకరా పో."

అలసటతో నిద్రలేక బరువెక్కిన కళ్ళతో, ఆకలితో, నీరసంతో, కాళ్ళీడ్చు కొంటూ ఆ ఉదయం స్కూలు మీదుగా వెళుతుంటే, పిల్లలంతా బారులు తీరుతు

న్నారు. ఒకటి రెండు కాగితం మువ్వన్నె జెండాలు వాళ్ళచేతుల్లో ఎగురుతున్నాయి. ముసలి సింగిల్ టీచరు బెత్తం ఝుళిపిస్తూ, స్వాతంత్ర్య దినోత్సవసన్నాహాలు చేస్తున్నాడు. అది స్వాతంత్ర్య దినోత్సవమని వాడు గుర్తుపట్టాడు.

మూడేళ్ళ కిందట తమ ఊళ్ళో అట్లా పిల్లల్లో ఒకడుగా నిలబడినవాడే. యేదో ఒక సంబరంలో, వుత్సాహంలో, వాళ్ళ ఊళ్ళో ఉండినప్పుడు వచ్చిన కడపటి స్వాతంత్ర్య దినోత్సవం రోజు అయ్యవారిని "స్వాతంత్ర్యమంటే ఏమిటి సార్?" అని అడిగింది గుర్తుకొచ్చింది. ఆయన చెప్పిన సమాధానం గుర్తుకు రాలేదు. గుర్తు చేసుకోవడానికి ప్రయత్నం చేస్తూ ముందుకు కదిలిపోయాడు. గొల్ల చిన్నబ్బ మంద దగ్గరకు చేరాడు.

రాముణ్ణి చూస్తూనే చిన్నబ్బ మందలోంచి పొట్లిపిల్లను తెచ్చి రామునికి పట్టి ఇచ్చాడు. ఇస్తూ ఇస్తూ "రాత్రి మీ అత్త నిన్నేమి అన్లే?" అని అడిగాడు. వాడు సమాధానం చెప్పకుండా పొట్టేలుపిల్లను తీసుకపోవడానికి ప్రయత్నించాడు. అది వెంట రాకుండా తన్నుకుంటూ "బెబె" అని అరిచింది. దాంతో మంద మందంతా అరవడం మొదలు పెట్టింది. పొట్టేలుపిల్ల అరుస్తున్నా, లాక్కుంటూ ముందుకు పోయాడు.

కొంత దూరం వెళ్ళే వేళకు పల్లెలోని స్వాతంత్ర్య దినోత్సవం పిల్లల జయ జయ ధ్వానాలు వినిపిస్తున్నాయి. ఇటువైపు మందలో జీవాల అరుపులు వినిపిస్తున్నాయి. దారిలో అటూ ఇటూ కదిలిపోతున్న ఎర్రటి చందమామ పురుగులు కన్పిస్తున్నాయి. వాన వెలిసిన రోజు వీచే చల్లటి ఉదయపు గాలి వీస్తోంది. లేయెండ మెరుస్తోంది. పొట్టేలుపిల్ల "బేబే" అంటోంది. రామునిలో ఏదో కదిలింది.

పొట్టేలుపిల్ల తాడు విడిచాడు. అది మందవైపు పరుగెత్తుకుంటూ పోతుంటే వాడిలో ఉత్సాహం ఏదో కదలాడింది. స్వాతంత్ర్యమంటే ఆ క్షణంలో వాడికి అర్థమైనట్లే ఉంది. ఒక చందమామను చేతిలోకి తీసుకొని కాసేపు ఆడుకొని విడిచి, అది నేలమీద కదలి పోతుంటే చూస్తూ సంతోషించాడు. ఆడుకొన్నాడు. 'సాయమ్మ ఇంటికి ఇక చస్తే పోను' అని తీర్మానించుకొన్నాడు.

సిన్నబ్బి మందలో కలిసిన పొట్టిపిల్లను మందలోనే ఉంచనిస్తారా? సాయమ్మ ఊరు కొంటుందా? దొరికితే తననేం చేస్తారో? అని అనుకున్నాడు. రామునికి ఆకలవుతోంది. ఎక్కడికి పోవాలో, యెక్కడ ఉండాలో, యెక్కడ తినాలో తెలియలేదు.

రామునికి అంతా అయోమయంగా ఉంది– తన స్వాతంత్ర్యం ఎట్లా నిలబెట్టుకోవాలో తెలీక. ●

© 30 ఆగష్టు 1981, విశాలాంధ్ర దినపత్రిక ఆదివారం